అయిందీ! అంటే మరో నాలుగేళ్ళయినా వుంటామని అనుకున్నాం కదా! సెలవలకి చిన్నమ్మాయివాళ్ళు వస్తామన్నారు. అల్లుడికి మన రాజసం - దర్బారు చూపించవద్దా! ఇంతకీ యే వూరు వేశారు?"

"హైదరాబాదా! వోరి నాయనో, అక్కడ మనలను యెవ్వరు చూస్తారు! ఎంత పెద్ద ఆఫీసరయినా గుమస్తాలాగానే కదా! చద్ది తినీ ఫైల్సు చేతపట్టుకుని బస్సు కొరకు పరుగెత్తాలి. ఆఫీసు కారు వుంది కదా అని యిన్నాళ్ళు కారు కొనలేదు. అదొక దండగ అనుకున్నాము. వోరి భగవంతుడా! ఇప్పుడు మన కెన్ని కష్టాలు! ఇంత బంగళా హైదరాబాదులో యెక్కడిదీ! రెండు వేలు పెట్టినా వస్తుందా! ఏమండోయ్! యింకా అక్కడే కూర్చున్నారా? రండి! కొంపదీసి మనకి బదిలీ అని యెవ్వరికైనా చెప్పారా?"

"లేదు - లేదు - అయినా నీవు నా తెలివిని తక్కువగా అంచనా వేస్తున్నావు డార్లింగ్?" అంటూ ఫోన్ పెట్టేశాడు.

గది బయట పొంచి ఈ సంభాషణ ఇంట్లో పనివాడు, ఆఫీసులో అటెండర్ అంతా విన్నారు.

రమణాజికి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అది గాలి కంటే వేగంగా ఆ డివిజన్ అంతా పాకిపోయింది.

గ్ర గ్ర గ్ర

రమణాజి ఏకాంత మందిరంలో భార్యతో చర్చలు సాగించాడు.

ఇప్పుడు హై లెవల్లో తనకు తెలిసినవాళ్ళెవ్వరూ లేరు. కొందరు దిగిపోయారు, మరికొందరు విలువలేకుండా పోయారు.

ఇప్పుడు ఎలాగ? అని ఆలోచనలో పడ్డాడు.

నిన్నగాక మొన్న బదిలీ అయిపోయిన శంకరప్ప గుర్తుకు వచ్చాడు. అతను తన గుమాస్తా. కాకితో కబురు పంపినా వస్తాడు. ఆఫీసు పనిమీద టెలిగ్రాం ఇచ్చి పిలిపించాడు.

శంకరప్ప పే....ద్ద ఆఫీసర్ ముందు చేతులు కట్టుకుని నిలుచున్నాడు.

అతన్ని చూస్తూనే రమణాజి "హి....హి... రావోయ్! ఇటు కూర్చో" అంటూ ముందు కుర్చీ చూపించాడు.

మరీ బలవంతం చేస్తుంటే కూర్చోకుంటే బాగోదని కుర్చీ చివర్లో సీటు ఆనించి బరువంతా కాళ్ళమీద వేసుకుని కూర్చున్నాడు.

"చూడు మిస్టర్ శంకరప్ప! నీకు ఆ యం ఎల్ ఎ బాగా తెలుసు కదూ? ఆయన మాట మన మినిస్టర్ బాగా వింటాడని వినికిడి. వారిద్దరు బాల్య స్నేహితులట. అరే ఒరే! అని పిలుచుకునే స్నేహం వుందట. నీవు....నాకు చిన్న సహాయం చేయాలి. నాకు ట్రాన్స్‌ఫర్ వచ్చింది. కాస్త ఆయనకి చెప్పి కాన్సిల్ చేయించాలి. నీకు తెలియంది యేముందీ! మీ అమ్మగార్కి....అదే నా వైఫ్‌కి వంటో బాగుండటంలేదు. ఇక్కడ డాక్టర్ బాగా అలవాటైపోయారు. ఈ సమ్మర్‌లో వెళ్ళాలంటే కష్టం. పైగా చిన్నమ్మాయి వస్తానంది. చెప్పుకుంటే అన్ని కష్టాలే! ఆ....ఖర్చుకు భయపడకు - ఎంత కావాలో అంత తీసుకు వెళ్ళు."

ఆనాడు సింహంలా గర్జించి నీతులు మాట్లాడినతను పిల్లిలా దీనంగా చూస్తూ కుక్కలా తోకాడిస్తున్నాడు.

ఆ రోజు అతనిచ్చిన వుపన్యాసాలు ఇప్పుడేమైనవి? అతని పిల్లలందరూ సెటిల్ అయిపోయారు. వున్నది ఇద్దరు. ఎక్కడికి వేస్తే అక్కడికి పోవటానికేం జబ్బు! ఈ వూరిలో ఆరేళ్ళు వున్నది చాలదా? ఛూ! అని ముఖాన వూయాలనిపించింది శంకరప్పకి. నీతులు చిన్నవాళ్ళకేనా? పెద్దవాళ్ళకి వర్తించవా? అని నిలదీసి అడగాలనిపించింది. కాని అవన్ని వారికి తెలియవా? తెలుసు. క్రిందికి వంగి చూసుకోరు అంతే! గురివిందగింజ వంటివారు అని తలుస్తూ ఆఫీసర్ యిచ్చిన డబ్బును తీసుకని రెకమెండేషన్ కొనుక్కురాను వెళ్లాడు శంకరప్ప.

# పోయినోళ్లు ఉన్నోళ్ల చేదుసురుతులు

"మొగుడనే వాణ్ని నేను వున్నానని గుర్తుందా?"

"ఉండకపోతే ఎట్టా మాట్లాడతానయ్యా?"

"అట్టా మాట్లాడొద్దని ఎన్నిసార్లు చెప్పానే! నీ ఎదవ బతుక్కి తోడు నాకాడ తెలివిగా మాట్లాడావా?" సోమయ్య రవణమ్మని గుంజ కేసి బాదేస్తున్నాడు. ఒంటి గుంజమీద నిలబడ్డ పూరికొంప గాలిలో దీపంలా ఒణికిపోతున్నాది. జాతరలో దుకాణాల ముందు మూగినట్లు జనం మూగి చూస్తున్నారు.

సోమయ్య గుడిశదగ్గర ఇది రోజూ జరిగే తంతు. ఆ గుడిశల్లో వాళ్ల సాయింత్రం అయేసరికి ఆరుబయట అన్నాలు పెట్టుకొని ఎంత అసంకల్పితంగా తింటారో అంతగా వీళ్ళతంతు గూడా చూసి ఆనందిస్తుంటారు. అక్కడున్న యాభై గుడిశల్లో కనీసం రెండుమూడు అయినా సాయంత్రంఅయేసరికి ఇలాంటి కార్యక్రమాలు ఉచిత వినోదంగా అందిస్తుంటాయి. అందులో మొగాళ్ళకి పెళ్ళాల్ని కొట్టడం ఒక స్టేటస్. అది మగతనానికి నిదర్శనంగా భావిస్తుంటారు. జీవితంలో ఒకసారయినా పెళ్ళాంమీద చెయ్యి చేసుకోనివాడు వాణమ్మకిందే లెక్క!

యాభై లోపడ్డ ముసలాళ్ల కుర్రాళ్ళని ఏడిపించడానికయినా "పెళ్ళాన్ని ఎప్పుడన్నా కొట్టి ఎరికావా?" అంటూ వుంటారు. వాళ్ళంతా చదువుకొన్నవాళ్లు కారు.

చదువుకున్నా పోతన పద్యం అసలు చదువుకోలేదు.

ఆ గుడిశలన్నిటికీ కలిపి ఒక కట్టు వుంది. మొగుణ్ని అదేమనగూడదు. కానీ మొగుడు కొట్టడం మొదలుపెట్టాక అతన్ని అడ్డమయిన బూతులూ తిట్టవచ్చు. ఆడదానికి తిట్టే అధికారం మొగాడికి కొట్టే అధికారం ఏ రాజ్యాంగం నుంచీ వాళ్లు తీసుకోలేదు. వాళ్ళంతట వాళ్ళే సాంప్రదాయకంగా నిలుపుకొంటున్నది అది.

జీవితంమీద రోతపుట్టినా కూలి గిట్టుబాటు కాకపోయినా నాటు ఫుల్‌గా తలకి ఎక్కినా ఆ రాత్రి మొగాడు పెళ్ళాన్ని ఏమయినా చేస్తాడు. అతను ఏంచేసినా రెండుమూడు గంటలు సేపు చుట్టూ ప్రేక్షకులు పట్టించుకోరు.

ఈ తతంగానిక్కి ఆరు వంచవర్ష ప్రణాళికల వయస్సు వుంది.

నాంచారు మొగుడికి స్నానం చేయిస్తూ ఓ కంట జరుగుతున్నదంతా గమనిస్తున్నాది! పెళ్ళాం ధ్యాస ఇక్కడ లేదని వాడికి తెలుస్తున్నాది. జాకెట్ కిందగా వీపుమీద మెల్లిగా ఒకటి తగిలించాడు. నాంచారు కెవ్వుమని ఈ లోకంలోకి వచ్చింది.

"నీ చెయ్యడిపోను! ఏందీ మోటుదనం?" నాంచారు ఎర్రబడ్డ వీపుమీద వేలేసి రాసుకుంటూ అంది.

"మోటుదనం లేపోతే మొగుడెట్లా అవుతాడే?" వెంకడు కిసుక్కున నవ్వాడు.

నాంచారుకి పెళ్ళయి ఆరు వారాలయింది. 'దానియేలుపేట' గుడిశల్లోకి వచ్చి కాపరంపెట్టి

'ప్రశాంత'

నాలుగు వారాలయింది. వెంకడు బుద్ధిమంతుడేగానీ చుట్టూ వాతావరణం చూసి తెగ భయపడుతున్నాది. వీడు గూడా అందరు మొగాళ్ళలా తయారయి తనని కొట్టడం మొదలెడ్తాడేమోనని నాంచారు భయం. చుట్టూ అంతా తాగుబోతులు తిరుగుబోతులు. ఇష్టం వచ్చినట్లు ■గెయ్యడం, తిరిగెయ్యడం. నోటికొచ్చినట్లు బూతులు మాట్లాడేసుకోడం. నాంచారుకి బస్తీ బతుకు మీద మోజు ఎక్కువ. అందుకని కోరి వెంకడ్ని చేసుకుంది.

సాయంత్రం అయేసరికి మిల్లునుంచి తిన్నగా ఇంటికొచ్చి స్నానం చేసి బయట మంచం వేసుకుంటాడు. కూడు తిని పడుకుంటాడు. బీడీలు గూడా తాగడు. అయితే రోజూ దీపాలుపెట్టే వేళకి చుట్టూ మొదలయే అల్లర్లు నాంచారులో చాలా భయాలు లేపాయి. అందులోనూ తను పల్లెలో మహా అల్లారు ముద్దుగా పెరిగింది.

రాత్రి పదకొండు అయింది. ఊరు సద్దుమణిగినా ఇంకా అక్కడక్కడ గుడిశల్లో గొడవ ఏదో వినబడుతున్నాది.

నాంచారుకి నిద్ర రావటంలేదు. పత్తికాయల్లా కళ్ళు మెరుస్తున్నాయి. 'ఏందే ఆలోసిస్తున్నావ్?' వెంకడు ఇటు తిరిగి పొట్టమీద చెయ్యి వేశాడు.

"మనం ఈడనుంచి లేసి ఎల్లిపోదాం...." నాంచారు మాటలకి వెంకడు పగలబడి నవ్వాడు.

"పీ బయం నాకు తెలిసి పోయిందే...." నాంచారు పట్టుబడిన దొంగలా సిగ్గుపడలేదు. రెప్ప ఆర్పని కళ్ళలో అలాగే ఆలోచన్లు కదులుతున్నాయి.

"ఈడకి మొదట్లో వొచ్చినోల్లంతా నీలాంటోలే. తర్వాత ఇలా అయారు. నువ్వేం గాబ్బోతీవా ఏంది? అలా అవకుండా వుండటానికి. ఆడదాన్ని కొట్టే మొగోడంటే నాకు అసయ్యం. సంపెయ్యాలనపించుద్ది. నాకు నీ మీద యెంత పేమ వున్నాసరే నేనది సయించలేను. నువ్వూ ఈల్లలా తయారయితే నిన్ను సంపి నేను సత్తా."

"ఛ! ఏందే ఆ మాటలు!" వెంకడి మాటలకి నాంచారు ఏం బదులు చెప్పలేదు. మాటలకి బదులు కన్నీళ్ళు పొంగాయి.

"ఆ మేడలో వుండేవాళ్ళూ మనుసులే! మనం మనుసులమే. కానీ మనం యెలా వుంటున్నాం? అల్లెలా వుంటుండారు?"

"ఎర్రిమాలోకమా! అల్లు మేడోల్లు. మనం గుడిశలోళ్ళం తెలిసిందా? ఇంక పడుకో" వెంకడు పక్కకి తిరిగి పడుకున్నాడు. నాంచారు అలాగే ఆలోచిస్తున్నది. ఈ సమస్యకి పరిష్కారం యేదో తొందర్లో చెయ్యాలి. ఆలస్యం అయితే దావూదుగాడు సుబ్బడుతో ఇంకా స్నేహం పెరుగుతుంది.ఏసాయింత్రమో మిల్లీ పుచ్చేసుకుని చల్లగా గుడిశకి వస్తాడు. తనకీ తన గుడిశకి యింత నిప్పు అంటిస్తాడు.

క క క

నాంచారు సౌందర్యకి నచ్చింది. రావుగారికి యింకా నచ్చింది. ఎంత నచ్చిందంటే యే కామెంటూ చెయ్యలేనంతగా నచ్చింది. ఈయనకి మరీ నచ్చినప్పుడు మెదలకుండా వుండిపోతాడు. అది ఆయన గుణం, ఆయన డిగ్నిటీ.

రావ్ సౌందర్యని చూసినప్పుడు గూడా ఏవీ కామెంట్ చెయ్యలేదు. అందుకే సౌందర్య అతని అర్థాంగి అయింది. అది ఆరేళ్ళనాటి మాట.

ఇప్పుడు నాంచారు కూడా నచ్చింది. అందుకే ఆ యింట్లో పనిమనిషి అయిపోయింది.

రావ్ ప్రముఖ వ్యక్తి. ఎందుకంటే పెద్ద పారిశ్రామికవేత్త. పెద్ద పారిశ్రామికవేత్తల దగ్గర పెద్దగా శ్రమించే శ్రామికులు వుంటారు. శ్రామికులు యెక్కడ కుప్పబడితే అక్కడ డబ్బు పిల్లలు పెడుతుంది. డబ్బు యెక్కడ వుంటే అక్కడ ఆ వ్యక్తికి అంత ప్రాముఖ్యత పెరుగుతుంది.

రావ్‌కి అరు ఫ్యాక్టరీలు వున్నాయి. వంద ఎకరాల కొబ్బరితోట వుంది. అందులో అందమయిన బంగళా వుంది. ఆ బంగళాలో బంగాళాఖాతం అంత లోతయిన, బలమయిన అనుభ



వాలు, సుఖాలు ప్రతి రాత్రీ దొరుకుతాయి. ఆ బంగళా కేవలం వ్యాపారం సుఖంగా సాగడం కోసం పుట్టింది. ఇన్‌కమ్ టాక్సు, సేల్స్ టాక్సు అధికారులు, గవర్నమెంట్ అండర్ సెక్రెటరీలు మంత్రులూ వగైరా రావ్ వ్యాపార అభివృద్ధి పథకాలమీద అక్కడే నిర్ణయాలకి వస్తుంటారు.

రెండు రైస్‌మిల్లు, నాలుగు కోళ్ళఫారాలు, బాల్‌బేరింగ్స్ తయారుచేసే ఫ్యాక్టరీ రెండు సినిమా థియేటర్లు, రాష్ట్రానికి ఓ బీరు కంపెనీ హోల్‌సేల్ ఏజెన్సీ, రావుగారి బహుముఖ వ్యాపారదక్షతకు చిన్న విషయసూచిక వంటవి.

దానిపేలుపేట అనబడే గుడిశల కంపుకి ఎదురుగా వున్న స్థలం అంతా రావుదే. కొండంత దేవుడ్ని కొండంత పత్రితో కొలవలేనట్లు అంత పెద్ద స్థలం అంతా యిల్లు కట్టలేక సింపుల్‌గా రెండు వేల గజాల కాంపౌండులో భారతీయ సంస్కృతి అంత పెద్ద ఇల్లు కట్టించాడు. ఆ యిల్లు చూడటానికి రెండు

కళ్ళు చాలవు. ఆ యిల్లంతా ఒక్కసారిగా తిరగడానికి రెండు కాళ్ళు చాలవు. అమెరికా నుంచి ఆర్కిటెక్ట్స్, జపాన్‌నుంచి స్పెషల్ రాళ్ళు ఫ్రాన్స్ నుంచి ఇంటి డిజైన్స్ ఇంగ్లాండు నుంచి స్టీల్ వచ్చాయి.

ఇండియా గొప్ప బీదదేశం అనడానికి దాని యేలుపేట, ఇండియా అంత అధ్వాన్నపు దేశం లేదు అనడానికి రావుగారి భవంతి, నిదర్శనంగా పక్క పక్కన ఎదురెదురుగా కనబడతాయి. ఆధునిక కాలంలో ఏకత్వంలో భిన్నత్వానికి నిదర్శనంగా ఈ ఆర్థిక అసమానత దేశంలో కావల్సినంత కనబడుతుంది.

రావ్‌గారి ఇంట్లోని కార్పెట్స్ మాత్రమే లక్ష రూపాయలు అవుతాయి. ఆ యింట్లో వున్న సోఫాసెట్స్ అన్నీ అమ్మేస్తే పాతిక కుటుంబాలకి జీవిత కాలం సరిపోతుంది. ఆ యింటి గూర్ఖా వెయ్యి రూపాయలు తీసుకుంటాడు. ఆ ఇంటి ప్రధాన కుక్కకి నెలకి పది వేల రూపాయలు ఖర్చు అవుతుంది. ఇంకా ఆ ప్రధాన కుక్కలు చాలా వున్నాయి.

పొద్దుటి నుంచి కడుపు కాలుతున్నవాడు ఖరీదయిన బాక్సాఫీసు కలర్ సినిమా చూసి ఇంటికొచ్చి అందులో హీరో పాత్రలో తనని ఊహించేసుకుని కాసేపు ఎలాంటి అబద్ధపు ఆనందం అనుభవిస్తాడో రావ్‌గారి ఇంట్లో పని దొరికిన రోజు రాత్రి నాంచారు గూడా అంత ఆనందంగా పడుకుంది.

పక్కన పడుకున్న వెంకడు మహా సంతృప్తిగా నిద్రపోతున్నాడు. నాంచారుకి మాత్రం నిద్ర రావడం లేదు. ఆమె ఆలోచనలు అనంతంగా వున్నాయి.

ఎలాగయినా అమ్మగారి దగ్గర మంచి పేరు సంపాదించుకోవాలి. అవిడ్ని మంచి చేసుకోవాలి. ఆ తర్వాత వెంకడ్ని గూడా వాళ్ళింట్లో పనికి పెట్టాలి. ఆ తర్వాత వాళ్ళింటి బోట్ హౌస్‌లో కాపరం పెట్టెయ్యాలి. ఇప్పటికే అందులో మూడు కాపరాలున్నాయి. వాళ్ళలో ఎవరో ఒకర్ని లేపేసి తాము చేరాలి. రోజంతా వెంకడు బంగళాలో పనిచేసి రాత్రి అమేసరికి ఆ బోట్‌హౌస్‌లోనే పడుకుంటిపోతాడు. ఇంక అసలు బయటకి రావడం వుండదు. వచ్చినా అలగా గ్యాంగుతో తిరగడు. నాటు తాగడు. మొగుడ్ని పూర్తిగా గుప్పెట్లో పెట్టుకోవచ్చు.

* * *

నాంచారు సన్నగా, నాజూగ్గా వుంటుంది. పుట్టింది పల్లె అయినా బస్తీ గులాబీలా నిగనిగలాడుతుంటుంది. ఆరు నెలల్లో వేషం భాష మరీ మెరుగయ్యాయి. ఫ్యాషన్ ఫోయ్యింది. కాస్త భేషజం వచ్చింది. సౌందర్యకి మరీ సన్నిహితురాలయింది. సౌందర్యకి ఒక్కడే కొడుకు. సురేష్‌కి ఆట మాట పాట కూడా నాంచారు అయిపోయింది. రాత్రిళ్ళు గూడా నాంచారు పక్కనే పడుకుంటాడు.

మొదట్లో నాంచారు సురేష్‌ని నిద్రపుచ్చి గుడిశకి వెళ్ళిపోయేది. ఇప్పుడు అదేం కుదరడం లేదు. తెల్లార్లూ వాడి పక్కలో వుంటే గానీ నిద్రపోవడం లేదు.


రెండు నెలలు కాకుండానే ఆ ఇంట్లో ఇంతటి స్థానం సంపాదించగలిగినందుకు నాంచారుకి మహా ఆనందంగా వున్నా లోలోపల చాలా బాధగా వుంది. తను రోజంతా ఇక్కడ వుండిపోతే మొగుడు అక్కడ బరితెగించిపోతాడు. తనకి తనుగా ఈ విషయం ఎలా చెప్పాలో అర్థంగాక తికమక పడుతున్నాది.

రాత్రి పదిన్నర అయింది. సౌందర్య పైన వున్న రూఫ్‌గార్డెన్‌లో పార్టీలో వుంది. జపాన్ నుంచి ఎవరో వచ్చారు. సాయంత్రం నాలు గంటలకే దుకాణం ఆరంభించారు. కనీసం మూడు అయితేగానీ జనం లేవరు. ఇంట్లో పనులన్నీ చేసి సురేష్ పక్కన కూర్చుని నిద్ర పుచ్చుతున్న నాంచారుకి చిరాగ్గా వుంది. తను ఎంత పనిమనిషయినా అర్ధరాత్రి అయిపోయినా మొగుడ్ని చూసుకోలేకపోతే ఎందుకి బతుకు?

"ఏం నాంచారూ, ఇంకా యింటికి వెళ్ళలేదా?" రావ్‌గారి గొంతుకి వులిక్కిపడి లేచి కూర్చుంది.

"వెంకడు నీ కోసం కబురు చేశాడు. వెధవకి నిద్ర పట్టడంలేదు కాబోలు...." ఫ్రిజ్ ఓపెన్ చేసి రావు స్కాచ్ ఓపెన్ చేస్తున్నాడు.






నాంచారుకి వీపు మాత్రం కనిపిస్తూంది. ఆ మాటకి ఆమె రియాక్షన్ ఎలా వుంటుందో అతనికి తెలుసు.

"అక్కడ వెంకడు, ఇక్కడ సురేష్‌తో నలిగిపోతున్నావ్ అవునా?" రావ్ ఆగి సంభాషణ పొడిగిస్తున్నాడు. గది అంతా చల్లగా వుంది. మేడమీదనుంచి రాక్ మ్యూజిక్ వినిపిస్తూంది. అక్కడి బీట్ యిక్కడి గుండెల చప్పుడు క్లాష్ అవుతున్నాయి. నాంచారుకి చలిగా వుంది. రావ్‌కి వెచ్చగా వుంది. ఫ్రిజ్ వయిన బాటిల్ పెట్టి గ్లాసులోకి పోస్తున్నాడు. ఆ పొయ్యడం రిథమిక్‌గా వుంది. మ్యూజికల్‌గా వుంది. సీసాలోంచి గ్లాసులో పొయ్యడంలో అతనికున్న అనుభవం కనిపిస్తున్నది. ఆడదాన్నీ బాటిల్‌నీ హాండిల్ చెయ్యడం గొప్ప ఆర్ట్ అని చెప్పినవాడు ఖచ్చితంగా గొప్ప ఆర్టిస్టు అయివుండాలి.

"నాంచారూ! కాస్త ఐస్ ఇవ్వు." నాంచారు ఫ్రిజ్ దగ్గరకు వచ్చింది. గుళ్ళో దేవుడులా ఫ్రిజ్‌కి అడ్డంగా నిలబడి వున్నాడు రావ్. అతన్ని తప్పుకోమనకూడదు. తను తప్పుకొని ఫ్రిజ్‌లోంచి గడ్డల్ని తియ్యలేదు. నాంచారు వంగి ఫ్రిజ్‌లోకి చెయ్యి పెట్టింది. ఆమె గుండెలకి జాకెట్టు కింద అతని తొడలు తగుల్తున్నాయి. ఆమె ముఖం మీదకి ఫ్రిజ్ చల్లదనం జిల్‌మనిపించేలా తగులుతున్నాది. గుండెలకి కరకుగా వేడిగా చల్ల చల్లగా అతని శరీరం తగులుతున్నాది.

....గుండెలు చేతులు ఒణుకుతున్నాయి. ముఖం తడి అవుతున్నాది. ఎందుకు? చలికా? ఉక్కకా? నాంచారుకే తెలీదు.

లోపల ఐస్‌ట్రేలో ఐస్ చాలా గట్టిగా వుంది. ఓ పట్టాన రావడంలేదు.

"చాలా గట్టిగా వుందండీ...."

రావ్ చాలా గొప్పగా నవ్వాడు. "అవును గట్టిగా వున్నాయి. అందుకే నిన్ను అడిగింది" రావ్ గొంతులో ఎన్నో అర్థాలు వున్నాయి. అందులో నాంచారుకి కొన్ని తెలుస్తున్నాయి. కొన్ని తెలీడం లేదు.

నాంచారు అలాగే అవస్థ పడుతున్నది. ఆ అవస్థలో తను ఇబ్బంది పడుతూ అతనికి ఆనందం ఇస్తున్నాది.

అప్పటికి సౌందర్య వచ్చి ఎంతసేపయిందో తెలీదు. ఆమె గాజుల చప్పుడు విని నాంచారు తలతిప్పి చూసింది. తల తిప్పడంలో అతనికి మరీ సన్నిహితంగా తగిలింది.

అయినా రావ్ వున్నచోటునుంచి కదల్లేదు,

"అమ్మగారూ, ఈ గడ్డ పగలడంలేదు...." నాంచారు ఎలాగో అంది.

రావ్ అన్నాడు, "సౌందర్యా! వెళ్ళి గేస్ట్స్ సంగతి చూడు. ఇద్దరం యిక్కడే వుంటే బాగుండదు."

"నాంచారుని యింటికి పంపిద్దామని వచ్చా."

"నాకు తెలుసు. కానీ అది ఇవాళ వెళ్ళడం లేదు."

"లేదు బాబూ! నే వెళ్ళాలి...." నాంచారు సమాధానం కోసం గూడా ఎదురుచూడకుండా గదిలోంచి గబగబా బయటకి వచ్చేసింది!

నాంచారు చాలా అప్‌సెట్ అయి గుడిశలోకి వెళ్ళింది. గుడిశలో నులక మంచంమీద పడుకున్న నాంచారుకి సౌందర్య గుర్తు వచ్చింది. ఆమె ఎంత అందమైనది! ఎంత మంచిది?

ఇవాళ మరీ బాగుంది! ఎర్రరంగు చీర, ఎర్రటి స్లీవ్‌లెస్ జాకెట్, ఎరుపెక్కిన పెదవులు, తలలో ఎర్రగులాబీలతో విరిసిన విప్లవంలా, పూసిన వసంతంలా వుంది. సౌందర్యకి ఎప్పుడన్నా కోపం వస్తే ఎలా వుంటుందో తెలియదు. అంత ఆస్థి వున్నా ఎంత నెమ్మదిగా వుంటుంది? ఆమె కళ్ళల్లో వెన్నెల తడారబోసుకున్నట్లు వుంటాయి. చిరునవ్వుల జలపాతాలు ఆ పెదవులమీద అనునిత్యం చిందేస్తూ వుంటాయి.

ఎన్నో లక్షల టన్నుల పాలు తీసి గడ్డచేసి ఆ రూపాన్ని మలిచినట్లు కనిపిస్తుంది సౌందర్య. అసలు ఆమె తలపులోనే కోటి సుగంధాల ఫీలింగ్. సౌందర్యని పొందిన అయ్యగారు ఎంత అదృష్టవంతుడోమరి!

—మరి యిందాక అలా ఎందుకు చేసినట్టు? అంత గొప్ప ఆడదాన్ని పొందిన మగాడికి మరో ఆడదాని కోసం కోరిక ఎలా పుడుతుందో? ఆ స్థానంలో తనే గాదు ఎవరూ తమని తాము వూహించుకోలేరు. ఎందుకంటే సౌందర్య అంతటి మహా యిల్లాలు. మహా మనసున్న ఆడమనిషి. అసలు ఇంతకీ అయ్యగారికి బయట తిరుగుళ్ళు ఉన్నాయా? ఏమో, తనకి తెలీదు. అమ్మగారు ఎప్పుడూ అలాంటి విషయాలు చెప్పలేదు. తన భ్రమగానీ అలాంటివి పరాయివాళ్ళకి ఎవరన్నా చెప్తారా? అసలీ మొగాళ్ళని నమ్మగూడదు. ఇంట్లో రంభ వున్నా వీధిలో బొందలకోసం ఎగబడ్తారు. నాంచారుకి నిద్ర పట్టటం లేదు. ఆలోచన్లు ఆమెని వదిలి పెట్టటం లేదు.

* * *

"ఏమిటే అలా వున్నావ్?"

"ఏం వుందమ్మా, బాగానే వున్నానే!"

"ఏం వుందో నాకేం తెలుసు?" సౌందర్య అందంగా నవ్వింది. ఆ నవ్వుని నాంచారు తన్మయంగా చూస్తున్నది. 'ఒక మాట చెప్పాలని వుంది, మీరు ఏమీ అనుకోనంటే....' నాంచారు కోడి ఈకలు పీకుతూ అంది.

"చెప్పు."

"రేపట్నుంచి సాయింత్రమే యింటికి వెళ్ళిపోతానండీ."

"అంటే యివ్వాల్టికి యిక్కడే వుండిపోతావా?"

"ఛ! అదిగాదండీ!" బాధగా నాంచారు చూసింది. సౌందర్య జోక్‌ని అందుకొనే స్థితిలో ఆమె లేదు. "అవేళ కూడా....అవేళండీ అసలు అయ్యగారు వస్తారని తెలీదు. ఆయన పిలిస్తేనే ఐస్ యివ్వడానికి వెళ్లా. నా తల్లి సాక్షిగా చెప్తున్నా. నా మనసులో ఏ పాపం లేదు" నాంచారు హఠాత్తుగా సౌందర్య కాళ్ళమీద పడిపోయింది. సౌందర్యకి కళ్ళనీళ్ళు వచ్చాయి. కానీ నిగ్రహించుకుంది. ఆమె పెరిగిన వాతావరణం ఎమోషన్స్‌ని ఆపే శక్తి యిచ్చింది. ఒక ఫీలింగ్‌ని యింకోలా ప్రదర్శించగలిగే శక్తి యిచ్చింది.

అందుకే సౌందర్య ఎదుటివాళ్ళు మంత్రముగ్ధులు అయేలా నవ్వింది. 'నీబుర్ర యివాళ ఏం బాగోలేదు. లేకపోతే యిలా వాగవు. అన్నట్టు నిన్న డబ్బులు అడిగావు గదూ! సాయింత్రం డబ్బులిస్తా. పెందరాళే సినిమాకి వెళ్ళు' అనేసి సౌందర్య వెళ్ళిపోయింది.

కాసేపు అయాక ఆమె బెడ్‌రూంలోనుంచి రేడియో వాల్యూమ్ చాలా పెద్దగా వినిపించింది. రేడియో అంత పెద్దగా ఎందుకు వినిపిస్తుందో నాంచారుకు అర్థం గాలేదు.

సాయింత్రం అయిదయింది. సౌందర్య ఎక్కడికి వెళ్ళిందో నాంచారుకి తెలీదు. డబ్బులిస్తే తీసుకుందామని బెడ్‌రూం దగ్గరికి వెళ్ళింది. సౌందర్య లేదు. రావ్ వున్నాడు. ఈ టైంలో ఆయన ఎందుకు వున్నాడో తెలీదు.

"రా నాంచారూ! డబ్బులు కావాలని అడిగావట. ఎంత కావాలి?" రావ్ అడగడంలో ఒక విధమయిన మొగదనం, తనని కొనేసిన ఫీలింగ్.

ఖరీదయిన పట్టులుంగీ కట్టుకుని రావ్ పచార్లు నిస్తున్నాడు. గవంతా సెంట్ వాసన. అది ముక్కుపుటాల్ని తల్లకిందులు చేస్తున్నది.

"డబ్బుల కోసం కాదండీ, అమ్మగారు కావాలి."

"దేనికి? కట్టుకున్న మొగుడులా దాని కోసం కలవరించిపోతా వేమిటి?"

నాంచారు ఏం మాట్లాడలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఏం లేదండీ, వంటింటిలో గుడ్లు కనబడలేదు. అందుకని...."

"సరేలే!" కాస్సేపు ఆగాడు. మనిషి కళ్ళలో కోరిక అడవి సింహంలా చిందులేస్తున్నాది. అటూ ఇటూ నిశ్శబ్దంగా పోరాటం జరుగుతున్నది.

ఇంతలో బయట గేటు దగ్గర్నుంచి పనివాడు సుందరయ్య కేక వినబడింది. నాంచారు గబగబా అటు వెళ్ళింది. రావ్ అడ్డుకోలేదు. ఆగమనలేదు.

* * *

"నిన్న చెప్పకుండా వెళ్ళిపోయావుటగదా?" సౌందర్య అసహనంగా అడిగింది.

"సుందరయ్యతో చెప్పి వెళ్ళానండీ. పని గూడా అంతాచేసి వెళ్ళిపోయా."

"అంత కొంప మునిగిందా, చెప్పకుండా వెళ్ళావ్?"

"మీరు ఇంట్లో లేరండీ."

"అయ్యగారు ఉన్నారుగా!—" సౌందర్య అదోలా అంది. ఆ మాట నాంచారుకి అసహ్యంగా అపస్వరంలా వినిపించింది. నాంచారు విచిత్రంగా ఆమెని చూసింది. సౌందర్య ముఖం అంతా ఉబ్బి వుంది. మెడపక్కన ఏదో రాసుకొన్నట్లు ఒరుసుకొన్నట్లు ఎర్రగా కమిలిపోయివుంది. అమ్మగారు ఎప్పుడూ అలా కనబడలేదు. ఇందాక తనకి బట్టలు వుతకడానికి వెళ్తే తనముందే జాకెట్ చీర విప్పి ఇస్తుంటే నడుంమీద వాపుగూడా చూసింది. రాత్రి కారుకి ఏదన్నా ప్రమాదం జరిగి దెబ్బ తగిలిందేమో అనుకొంది. ఇప్పుడు యెందుకో కాదనిపిస్తున్నాది.

"చెప్పకుండా వెళ్ళకు నాంచారూ. చెప్పిన పని చెయ్యనివాళ్ళంటే నాకు చాలా అసహ్యం" అతికష్టంమీద ఎలాగో అనగలిగింది. షాక్ తిన్న నాంచారు తలఎత్తి చూసేసరికి అక్కడ లేదు.

దీపాలు పెట్టారు. ఊరు చల్లబడుతున్నాది. ప్రకృతి సృష్టిమీద చీకటిదుప్పటి కప్పుతున్నది. ఆ దుప్పటికి చిల్లులు పెడుతున్నట్లు మనుషులు దీపాలు వెలిగిస్తున్నారు. స్వర్గంలాంటి అంత ఇంట్లో దీపాలు వెలుగుతున్నాయి. కానీ అది శూన్యం అయిన ఇంద్రసభలా దిగులుగా ఉంది. ఆ శూన్యతలో భయం గందరగోళం అసహ్యం గడ్డకట్టి నాట్యం చేస్తున్నాయి. జీవిత సంగీతం, మానవ సాహిత్యం అపధంశం అయినట్లు ఏదో ఫీలింగ్.

నాంచారు బాబుని స్నానం చేయించి డ్రస్ చేసి తను పెళ్ళి మొహం కడుక్కొంది. ఇంక తను వెళ్ళిపోవాలి అనుకుంటూ వుండగా మేడమీద నుంచి సౌందర్య పిలిచింది. బయట షెడ్‌లో కారు గేటుదగ్గరికి వస్తున్న శబ్దం.

"నాంచారూ! ఐస్ బాక్స్‌లో ఐస్‌వుంది. తీసుకెళ్ళి గార్డెన్ బంగళాలో ఇచ్చేసిరా. కారులో వెళ్ళి అందులో వచ్చెయ్. అయ్యగారికోసం

ఎవరో వస్తున్నారు. అక్కడ మస్తాన్ అన్నీ ఏర్పాటుచేశాడు. బంగళాలో ఫ్రిజ్ చెడిపోయిందట. ఐస్ పంపమని అయ్యగారు ఫోన్ చేశాడు" సౌందర్య పౌడర్ రాసుకుంటూ ఎటో చూసి చెప్తున్నాది.

"డ్రైవర్ ఇస్తాడుగదండీ. ఇంకా నేనెందుకు?...." భయంభయంగా ఎలాగో నాంచారు అనగలిగింది.

"నాంచారూ!" సౌందర్య అరచిన అరుపుకి అర్ధరాత్రి అడవిలో సింహం చేసే గర్జనకి ఉలిక్కిపడ్డ ప్రకృతిలా నాంచారు అదిరిపడింది.

"చెప్పిన పని చెయ్. ఈ ఇంట్లో అయ్యగారు ఏం చెప్తే అది జరగాలి. అంతే. ఎందుకు? అనే ప్రశ్నలు ఈ కాంపౌండ్‌లో లేవు" అని సౌందర్య హఠాత్తుగా అంతలోనే తనని తమాయించుకొని "వెళ్ళు నాంచారూ, విసిగించకు. అసలే నాకు ఏం బాగోలేదు. నేనేం మాట్లాడలేను—" సౌందర్య ఎలాగో అంది. బయట వరండాముందు వెంకడు వేస్తున్న కేకలు గందరగోళంగా వినిపిస్తున్నాయి. వెంకడు ఎప్పుటూ ఇటుకేసి రాడు.

నాంచారు గబగబా కిందకి పరిగెత్తింది. సౌందర్య కూడా వచ్చింది. వెంకడు ఫుల్‌గా తాగేసి వున్నాడు. నాంచారుకి భూమి ఆకాశం తెలీడం లేదు. మందు ఎరగని వెంకడు ఇవాళ ఇంతగా ఎందుకు తాగాడు? మనిషి బూతులు తిడ్తున్నాడు. నిలబడలేకపోతున్నాడు.

"ఏళ ఎంతయిందే లంజా? నువ్వు ఎవర్తో కాపరం చేస్తావ్? దాంతోనా నాతోనా?...."

"ఏందా వాగుడు?"

"వాగుడేందే నీయమ్మ! పొద్దస్తమానూ ఈడే వుంటే నేనేం గావాల. ఈ మేడగాలి నీకు బాగా తగిలిందే" ఫళ్ని నాంచారుని కొట్టాడు. నాంచారు తూలి స్తంభానికి కొట్టుకుంది. అందమయిన కొప్పు కుప్పలా ఊడి జారిపోయింది. వేరే మూడ్‌లోవున్న సౌందర్య యింకా ఈ లోకంలోకి రాలేదు. ఆమె తేరుకునేసరికి వెంకడు నాంచారుని కాల్తో తన్నుతూ నడుం మీద గుద్దుతూ రొప్పుతూ బూతులు గుప్పిస్తూ గేటు తోసుకుని లాక్కునిపోయాడు. నాంచారు ఒంటిమీద ప్రతి దెబ్బా తనమీదనే పడ్తున్న ఫీలింగ్. ఏమిటీ ఆడజీవితం? ఇన్ని వున్నా తనకి ఒకరకం బాధ. ఏమీలేని నాంచారుకి మరోరకం బాధ. ఖోరికో స్తంభం పట్టుకొని సౌందర్య అలాగే వుండిపోయింది.

దానిఏలు పేట గుడిశల్నించి నాంచారు కేకలు అరుపులు వికృతంగా వినిపిస్తున్నాయి. మిగిలిన గుడిశల్లోవాళ్ళు కొత్తగా విడుదల అయిన సినిమా చూసినట్టు విరగబడి చూస్తున్నారు. వెంకడు నాంచారుని అవేళే తొలిసారిగా కొట్టడం. వాడికి తాగడం కొత్త. పెళ్ళాన్ని కొట్టడం మరీకొత్త. తన్నడానికి కాలెత్తి బురదలో పడ్డాడు. డేనియల్, సూరడు గంగయ్య వాళ్ళ పెళ్ళాల్ని కొట్టడం రోజూ చూశాడు. అవన్నీ ఇప్పుడు సబ్‌కాన్‌షస్‌లో గందరగోళంగా తల్లకిందయిన బొమ్మల్లా తిరుగుతున్నాయి.

నాంచారు ముఖం మంచం కోడుకు తగిలింది. జాకెట్ పూర్తిగా చినిగిపోయింది. ఆ క్షణంలో వాడు రావ్ మాదిరిగా కట్టుకున్న పెళ్ళాం పరాయి ఆడదానిలా కనిపిస్తున్నది. పెళ్ళానికి యెంత ఆచ్ఛాదన తొలగితే అంత గర్వం పెరుగుతున్నాది. ఆమె ఎంత యేడుస్తుంటే వాడికి అంత స్మూత్‌గా తగుల్తున్నాది.

రాత్రి పది దాటింది....పదకొండు అవుతున్నాది. వెంకడు ఆగి ఆగి రెచ్చిపోతున్నాడు. పాత ఆడియన్స్ వెళ్ళిపోయి కొత్త ఆడియన్స్ వస్తున్నారు.

గుడిశల్లో బీభత్సం. అరుపులు, కేకలు చీకాకు. అసహ్యకరం అయిన ఏడుపులు. అటు మేడని నిశ్శబ్దం రాజ్యం చేస్తున్నాది. శూన్యం ఏలేస్తున్నాది. అటు నిశ్శబ్దం. ఇటు గందరగోళం. పన్నెండు అవుతున్నది. కాలం మాత్రం సాగిపోతున్నది. బంగళాలో లైట్లు ఎప్పుడు ఆరిపోయాయో తెలీదు. ఇంతలో ఇంపోర్టెడ్ టమోటా కారు గేటు దగ్గర ఆగింది. మేడ అంతా లైట్లు వెలిగాయి. కారు



లోపలికి వెళ్ళింది. మహారాజుకి స్వాగతం చెప్పి వందనంచేసి వెనక్కి తప్పుకొనే సైనికుల్లా రావ్ లోపలికి వెళ్తుంటే వెనకనుంచి ఒక్కొక్కలైటు ఆగిపోతున్నాది.

ఒంటిగంటకి ఇంకా ఎంత టైం బాకి వుందో తెలీదు. సగం గుడిశలు నిద్రపోతున్నాయి. బజారు నిశ్శబ్దం అయిపోయింది. శర్తోపహతులు దీనులు హీనులు ఇంకా అక్కడక్కడ డొక్కలు ఎగరేస్తున్నారు.

వెంకడికి తాగినమత్తు ఇంకా దిగినట్లు లేదు. కింద పడున్న నాంచారుని మళ్ళీ జుట్టు పట్టి లాగి బూతులు తిడుతున్నాడు. నాంచారు రోకలిబండ తీసుకుని తలమీద దభీమని కొట్టింది. వెంకడు మహావృక్షంలా పడి


## మీరు చదివారా?

### అగ్రశ్రేణి రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి రచనలు

వన్ - టు - గో ....

అమ్మాయిలు ఆరుగురూ ముందుకు దూకారు. అబ్బాయిలు అరవైమంది ఈలలు వేశారు, కేకలు వేశారు.

**ఇదీ కథ** వెల : రు. 12-00

'రాతలు గాడిదలు కాస్తుంటే బుద్ధులు భూములేలుతుంటాయి' అన్న అధిక్షేపానికి బదులుగా పార్వతి ఉడుకు నెత్తురు సవాలు

**వైతరణి** వెల : రు. 7-50

"నిన్ను చూసేదాక తెలియదు నాలో మనసుందని. నిన్ను తాకేదాకా తెలియదు నాలో వలపుందని. నిన్ను....నిన్ను"

**నింగినుండి నేలకు** వెల : రు. 11-00

"నా భార్య మా పక్కింటాయనతో సరసాలకు దిగుతోందని నా అనుమానం. నిజం ఒప్పుకోమంటే ఒప్పుకోవటంలేదు. ప్రమాణం చేయమంటే రామాయణం వంకరగా పట్టుకుంది.

**యదార్థ గాథలు** వెల : రు. 6-00

మీకు కావలసిన పుస్తకములకు ముందుగా మీ దగ్గరలోనున్న పుస్తకాల షాపులోగాని, న్యూస్ ఏజంటున్నగాని అడగండి. లేదా పుస్తకాల వెలలో రు. 1-00 తగ్గించి M. O. చేయండి. పోస్టు ఖర్చులు మేమే భరించి ఆ రు. 1-00కి V. P. పంపగలము.

**శ్రీ లక్ష్మీ పబ్లికేషన్స్,** ఏలూరు రోడ్, విజయవాడ-2.

పోయాడు. తాగకపోయినా మనసు వశం తప్పిన నాంచారు అలాగే దభీదభీమని కొట్టింది. వాడి తలమీద ఎన్ని తగిలాయో గుండెలమీద ఎన్ని తగిలాయో తెలీదు. గుడిశలో దీపం కూడాలేదు. రోకలి అంతా తడిసిపోయింది.

దూరంగా బంగళాలో ఆఖరి దీపం ఆరిపోయింది.

తెల్లవారింది....గుడిశనిండా జనం....గుడిశ చుట్టూ జనం. ఎటు చూసినా జనం; రాత్రి నాంచారుని కొడుతున్నప్పుడు వున్న జనం అంతా వున్నారు. రాత్రి కళ్ళముందు చిత్రవధ చేస్తున్నా ఏం మాట్లాడని వాళ్ళంతా ఇప్పుడు వెంకడిమీద సానుభూతిగా మాట్లాడుతున్నాడు. రాత్రి వాడు తాగి కొట్టడంలో తప్పులేదు. తిరగబడ్డందుకు నాంచారు దోషిగా తయారయింది.

ఎదురుగా రావుగారి బంగళాముందు అంగుళం స్థలం లేకుండా కార్లు నిండిపోతున్నాయి.

—రాత్రి అమ్మగారు గుండె ఆగి మరణించారట! నాంచారు గుండె పగిలింది. సౌందర్యకి గుండె ఆగిపోవడమా? లేదు! లేదు! ఆగిపోలేదు! ఆపేశారు. దాన్ని చీల్చి కాల్చి కోసి తీసేశారు. లేదు కాదు కాకూడదు. ఇదంతా అబద్ధం. అసంభవం. కానీ తను ఎవర్తో చెప్పుకోగలదు. తన మాట ఎవరికి కావాలి?—

ఎందరు ఆపుతున్నా విడిలించుకుని చీకటిని చీల్చే ఎర్రటి వెలుతురులా నాంచారు బంగళా కేసి పరిగెత్తింది.

సౌందర్య పోర్టికోలో ఉంది. దుప్పటి కప్పారు. పూలు చల్లారు. అగరొత్తులు వెలిగించారు. మంత్రాలు చదువుతున్నారు. సానుభూతులు వర్షిస్తున్నారు.

కానీ ఇవేవీ సౌందర్యకి తెలీదు. అక్కర్లేదు. నాంచారు చెప్పాలనుకునేది కూడా ఎవరికీ అక్కర్లేరు.

చనిపోయి ఆమె బ్రతికివుండి తనూ ఏమీ మాట్లాడలేదు.

—రావ్ దూరంగా కుర్చీలో ఎటో చూస్తూ కూర్చున్నాడు. భార్యను పోగొట్టుకున్న విషాదమూర్తిలాకాదు. మరో పెళ్ళికి మరో అపూర్వ స్త్రీ అనుభవానికి ఎదురుచూస్తున్న వాడిలా వున్నాడు.

నాంచారు చూసిన చూపులో మంటలు ఒంటిమీద పడ్తున్నట్లు రావ్ ఉలికిపోయాడు. ఇంతలో ఎవరో వస్తే వాళ్ళను రిసీవ్ చేసుకోడానికి గేటుదగ్గరికి వెళ్ళాడు.

హఠాత్తుగా పోలీసువ్యాను గేటుముందు ఆగింది. ఇనస్పెక్టర్ సుబ్బారావు, కానిస్టేబుల్స్ దిగారు. రావ్ షాక్ తిన్నాడు.

"ఏమిటి ఇలా వచ్చారు?"

"ఆ గుడిశల్లో ఒక బిచ్ మొగుడ్ని చంపేసింది. దాన్ని అరెస్టు చెయ్యడంకోసం వచ్చాం. అది మీ ఇంట్లోనే పని చేస్తుందట."

"అవును! అదుగోండి...." నాంచారుని చూపించాడు. నాంచారు రావ్‌ని నీచంగా అసహ్యంగా చూసిన చూపు అతన్ని కంగారు పెట్టింది. నాంచారుని పోలీసులు తీసుకొచ్చారు.

"రావుగారూ! రాత్రి మీభార్య పోయిందట. ఐ డోంట్ నో హౌ టు కన్వే మై సారో. రియల్లీ షీ ఈజ్ ఏ గ్రేట్ వుమన్. కానీ ఏం చేస్తాం. అన్నీ మన చేతిలో వుండవు. బాధపడకండి" సుబ్బారావు కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకున్నాడు.

నాంచారు పొడికళ్ళతో వ్యానెక్కింది. □

## సీరియల్




మర్నాడు—

ఆ రోజు మీరా రాదనే అనుకున్నారు ఇంట్లో.

శాంతమ్మగారు కాఫీ డికాషన్ తీసి, పాలు కాచి—పువ్వులు కోసుకోవడానికి దొడ్లోకి